క్లుప్తంగా

పక్కాగా రికార్డుల నిర్వహణ


మాట్లాడుతున్న సీఎస్‌డీటీ సంతోష్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: పౌర సరఫరాల దుకాణాల్లో నిత్యావసర సరుకులకు సంబంధించి రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సీఎస్‌డీటీ సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్టాక్, సేల్స్ రిజిస్టర్లతో పాటు విజిట్ బుక్ పక్కాగా ఉండాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న అధికారులు

కంచిలి: ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ వి.నీరజ అన్నారు. మండలంలోని జలంత్రకోట, బూరగాం పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పైడిగాం చానెల్ పూడిక తీత పనులను శుక్రవారం పరిశీలించారు. పైడిగాం ఆయకట్టుదారులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే ఈ చానెల్ పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జి.ధనుంజయ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


రికార్డులను పరిశీలిస్తున్న మీనాక్షి

సంతబొమ్మాళి: దండుగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ బమ్మిడి మీనాక్షి శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. ఫార్మసీలో మందుల నిల్వలు, పంపిణీని అడిగి తెలుసుకున్నారు.ఖాళీ పోస్టులపై ఆరా తీశారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ


ఇచ్ఛాపురం రూరల్: రైతులకు సూచనలిస్తున్న ఏఓ భార్గవి

ఇచ్ఛాపురం రూరల్: అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేస్తామని మండల వ్యవసాయాధికారి డాక్టర్ టి.భార్గవి అన్నారు. శుక్రవారం కొఠారీ, ఈదుపురం గ్రామాల్లో కౌలు రైతులకు గుర్తింపు కార్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చూడామణిరెడ్డి, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్ యాదవ్, దుక్క ధనలక్ష్మీ, ఏఎంసీ మాజీ చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం


నగదు అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

కవిటి: మండలంలోని జి.కరపాడు గ్రామానికి చెందిన నర్తు సురేష్ (కాశీప్రసాద్) వారం రోజుల క్రితం కేరళలో కూలి పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుటుంబానికి ఆధారమైన యువకుడు మృతి చెందడంతో కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు రూ.25000 ఆర్థిక సాయాన్ని శుక్రవారం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల్లో పంచదార కట్!



ఇచ్ఛాపురం రూరల్: నిత్యావసర సరుకుల పంపిణీలో బియ్యంతో పాటు పంచదార, పప్పు ఇస్తారనుకున్న రేషన్ కార్డుదారులకు ఈ నెల నిరాశే ఎదురైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల పాటు ప్రతి నెలా బియ్యంతో పాటు పంచదార అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి నెలలోనే పంచదారను కట్ చేయడంతో కార్డుదారులు అసహనం వ్యక్తం చేశారు.

రథయాత్రకు వేళాయె..!

- రేపటి నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు
- 11న హిరా పంచమి
- 15 వరకు టెక్కలిలో ఉత్సవాల నిర్వహణ

టెక్కలి:

జగదానంద కారకుడు జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు ఆదివారం నుంచి టెక్కలిలో ప్రారంభం కానున్నాయి. రాజుల కాలం నుంచి నేటికీ పట్టణంలో ఏటా జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్థానిక పెద్దబ్రాహ్మణవీధిలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖాధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు కుటారి పండా, పి.ప్రతాప్, తరణి పండా, ప్రఫుల్లా పారిడా, హరిశ్చంద్ర ప్రధానో తదితరుల నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రాహ్మణవీధితో పాటు మండలంలోని పోలవరం, డమర గ్రామాల్లోనూ ఈ నెల 15 వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో స్వామి వారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. 7న బ్రాహ్మణవీధిలో మొదటి రథయాత్రతో ప్రారంభమై పాత జాతీయ రహదారిలోని గుండిచాదేవి ఆలయంలో


టెక్కలిలో సిద్ధమైన జగన్నాథ రథం



రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్న గుండిచాదేవి ఆలయం (ఇన్‌సెట్లో) ఉత్సవాలకు సిద్ధమైన జగన్నాథస్వామి

మిగిలిన యాత్ర జరుగుతుంది. ఇదే ఆలయంలో 8న మత్స్యవతారం, 9న కూర్మావతారం, 10న వరాహావతారం, 11న హిరాపంచమి సందర్భంగా నరసింహావతారం, 12న పరశురాముని అవతారం, 13న రామావతారం, 14న కృష్ణవతారం, 15న మారు రథయాత్రతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దేవదాయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, పోలీస్ సిబ్బంది బందోబస్తుకు సిద్ధమవుతున్నారు.

పురాణ గాథ..

టెక్కలిలో ఏటా జరుగుతున్న రథయాత్రకు సంబంధించి పురాణ కథ ఉంది. పెద్దబ్రాహ్మణవీధిలో ఆలయంలో లక్ష్మీ సమేతంగా కొలువైన జగన్నాథుడు తొలి దశమి రోజు యాత్ర సమయంలో భార్యకు చెప్పకుండా పాత జాతీయ రహదారిలోని తన పిన్ని గుండిచాదేవి ఆలయానికి వెళ్లిపోతారు. ఆ తర్వాత హిరాపంచమి రోజున లక్ష్మీదేవి గుండిచాదేవి ఆలయానికి వెళ్లి జగన్నాథస్వామికి తిరిగి రమ్మని బతిమాలుతుంది. స్వామి నిరాకరించడంతో లక్ష్మీదేవి అలిగిపోయి తిరిగి పెద్దబ్రాహ్మణవీధిలోని ఆలయానికి వెళ్లిపోతుంది. మళ్లీ యాత్రలు ముగిసిన తరువాత జగన్నాథుడు లక్ష్మీదేవి వద్దకు వెళ్లగా ఆమె నిరాకరిస్తుంది. దీంతో రుషులు లక్ష్మీదేవిని బతిమాలి మరలా ఇద్దరిని ఒక్కటి చేస్తారని స్థానికులు చెబుతుంటారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చందు, విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌ఖమర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కొత్తగా చేరిన విద్యార్థుల నుంచి వార్డెన్ అదనంగా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే తమకు న్యాయం చేయాలని కోరారు.


సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

8న పీడీఎస్ బియ్యం వేలం

కోటబొమ్మాళి: చీపుర్లపాడులోని వసంతలక్ష్మీ రైస్ మిల్లు గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 21,970 కేజీల పీడీఎస్ బియ్యాన్ని గతేడాది జిల్లా విజిలెన్సు, రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ బియ్యాన్ని సోమవారం కోటబొమ్మాళి తహశీల్దార్ సమక్షంలో వేలం వేస్తున్నట్లు సివిల్ సప్లయ్ డీటీ కె.రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

‘ఆదిత్య’లో పుస్తకావిష్కరణ

టెక్కలి: మారుతున్న కాలంతో పాటు విద్యార్థులకు ఉపయోగపడేలా అధ్యాపకులు రచనలు చేయాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి. నాగేశ్వరరావు సూచించారు. కళాశాల అధ్యాపకులు కోరెడ్డి విజయలక్ష్మి, గుత్తావెల్లి పోలీస్‌నాయుడు, నడిమింటి శైలజ తదితరులు రాసిన ‘కాంపోనెంట్స్ ఆఫ్ ఇంగ్లిష్ లిటరేచర్ యలాంగ్ విత్ లాంగ్వేజ్’ అనే పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ బీటెక్, డిగ్రీ, లిటరేచర్ కోర్సుల్లో ఆంగ్ల భాష నేర్చుకునే వారికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు మల్లా రమణయ్య, ఎం.వి.రత్నమణి, ఎం.పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్

పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 7న జరగనుందని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి మురళీమోహనరావు, దానేటి కేశవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరసవల్లి సమీపంలో ఉన్న సంఘ నూతన కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి కార్యవర్గంతోపాటు అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ పాఠశాలలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున శుక్రవారం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘ నాయకులు సూరాడ దాసురాజు, మాజీ సర్పంచ్ కర్రి రామ్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుగ్గు సీతయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న చిన్మయిదేవి

ఇచ్ఛాపురం: గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని ప్రాంతీయ సంచాలకులు జి.చిన్మయిదేవి అన్నారు. పట్టణంలోని కస్పాజాలారి వీధిలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగరాణి, సూపర్‌వైజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ఇచ్ఛాపురం రూరల్: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని ఏపీజీవీబీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.ఎస్.మూర్తి అన్నారు. శుక్రవారం తేలుకుంచిలో స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు, రుణం, గ్రామ సంఘం నుంచి తీసుకున్న రుణాలు, శ్రీనిధి రుణాలు, ఎస్టీ,ఎస్సీలకు ప్రయోజనం కోరే ఉన్నతి రుణాలపై అవగాహన కల్పించారు.


సమావేశానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

రేషన్ సరుకుల పంపిణీ పరిశీలన


పంపిణీని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ భరత్‌నాయక్

కాశీబుగ్గ: మందస మండలం బైరిసారంగపురం పంచాయతీ పరిధిలో జరుగుతున్న రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియను పలాస ఆర్‌డీఓ భరత్‌నాయక్ శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు అందివ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

దోమల నివారణకు ఫాగింగ్

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని పలు ప్రధాన మార్గాల్లో శుక్రవారం దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాన మార్గాలతో వీధుల్లోనూ ఫాగింగ్ యంత్రం తిప్పాలని స్థానికులు కోరుతున్నారు.


నౌపడ రోడ్డులో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

మహిళా చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఇచ్ఛాపురం: మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సుజాత అన్నారు. పురుషోత్తపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంకల్ప 100 రోజుల కార్యక్రమం నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 1, 2 వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్ కుమార్, చాట్ల పుష్పలత, మహిళా కార్యదర్శి సూర్యకుమారి, ఐసీడీఎస్ సిబ్బంది నీలవేణి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా జగన్నాథ కల్యాణం

టెక్కలి : స్థానిక పెద్ద బ్రాహ్మణవీధిలోని గోపాల జగన్నాథ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి నేత్ర పర్వంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవి సమేత జగన్నాథస్వామి కల్యాణం జరిపించారు. భక్తులంతా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



నేడు ర్యాబిస్ వ్యాక్సినేషన్

టెక్కలి: జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం టెక్కలిలో పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్లు వేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ జి.రఘునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పశువుల ఆస్పత్రిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల పట్ల అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

కంచిలి: జూనోసిస్ డే సందర్భంగా శనివారం కంచిలి పశువైద్యశాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ టి.శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని పేర్కొన్నారు.

కోటబొమ్మాళి: జూనోసిస్ డే సందర్భంగా కోటబొమ్మాళి ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో కుక్కలతో పాటు పెంపుడు జంతువులకు ఉచితంగా ర్యాబిస్ టీకాలు వేయనున్నట్లు వెటర్నరీ ఏడీ మంద లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భూసమస్యలు పరిష్కరించండి

కంచిలి: రైతులకు ఇబ్బందులు కలగకుండా భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తహశీల్దార్ ఎం.వి.కె.ఎస్.రవి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాయింట్ ఖాతాలను వేరు చేసి, వారి వ్యవసాయ రుణ అవసరాలకు తగ్గట్టుగా అడంగల్, 1బీలు ఆన్‌లైన్లో దరఖాస్తు చేస్తే వెంటనే వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కొండల ప్రాంతాల్లో రీసర్వే చేయని భూముల్లో సరిహద్దులు గుర్తించాలని సూచించారు. సమావేశంలో డీటీ డి.సంతోష్, రీసర్వే డీటీ ఎం.కృష్ణమూర్తి, మండల సర్వేయర్ కె.నాగేశ్వరరావు, ఆర్‌ఐ అపర్ణ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న తహశీల్దార్ రవి

ధ్వజస్తంభ తాపడం ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

కవిటి: మండలంలోని ముత్యాలపేటలో అమృతవర్షిని సమేత మహామృత్యుంజయ స్వామి దేవాలయం ధ్వజస్తంభం తాపడం ఏర్పాటుకు బొరివంక గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఆనంద్ రౌళో శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాలయ అభివృద్ధికి సహకరించినందుకు మహామృత్యుంజయ స్వామి భక్త సమాజం ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.


కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఆనంద్ రౌళో

సాగుదారు హక్కు పత్రాల పంపిణీ


కొర్లాంలో పత్రాలు అందజేస్తున్న ఏఓ నర్సింహమూర్తి

సోంపేట: వ్యవసాయ శాఖ ద్వారా అందజేస్తున్న సాగుదారు హక్కు పత్రాలను కౌలురైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. బేసిరామచంద్రాపురం, కొర్లాం పంచాయతీల్లో శుక్రవారం కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. సాగుదారు హక్కు పత్రాల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రాంబుడ్డి గణపతి, బుద్దాన శ్రీకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి రవి, వ్యవసాయ సహాయకులు ధనలక్ష్మి, మీనా పాల్గొన్నారు.

డయేరియాను అరికడదాం

ఇచ్ఛాపురం రూరల్: ఇంటింటా స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొళిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.కల్యాని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారులకు అతిసారం వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 31 వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఎఫ్‌పీజీ సంఘాలపై అవగాహన

కాశీబుగ్గ: మందస మండలం రంగనాథపురంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులతో ఏపీఎం గొడబ ప్రసాదరావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీజీ (ఫార్మర్ ప్రొడ్యూసర్స్ గ్రూప్స్) సంఘాల సభ్యుల ప్రధాన జీవనధారం వ్యవసాయమేనని, సుస్థిర వ్యవసాయం ముఖ్య లక్ష్యమని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ సామాజిక భద్రతతో పాటు ఉత్పత్తిదారులకు, వ్యవసాయ కూలీలకు, వినియోగదారులకు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలను కల్పించడమే సుస్థిర వ్యవసాయం ప్రధాన ఉద్దేశమన్నారు. వాతావరణం పరిస్థితులను అనుసరించి పంటలు, వ్యవసాయానికి అనుబంధంగా పూలు, పాడి పశువుల పెంపకంతో రైతులు ప్రయోజనాలు పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాదరావు, వీఓఏ మోహిని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

అంబులెన్సుకు దారేదీ?


అంబులెన్సులు వెళ్లే దారిలో ద్విచక్ర వాహనాలు

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రి ఆవరణలో వాహనాల పార్కింగ్ సమస్యగా మారుతోంది. ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు నిర్దిష్టమైన స్థలం కేటాయించినప్పటికి కొందరు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వాహనాలు నిలపడంతో సమస్య జఠిలమవుతోంది. ఈ మార్గం ద్వారానే రోగులకు అత్యవసర సేవలు అందించే 108, 104, 102 తదితర అంబులెన్స్‌లు వెళ్లాల్సి ఉంది.

ఇక్కడ సందర్శకుల బైకులు, కొందరు వైద్యుల వాహనాలు సైతం నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.